
సాక్షి ఒడిశా

ఆదివారం । 8 । జనవరి । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,68,965లు, బంగారం 4.95 గ్రాములు, వెండి 229 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

రేసు గుర్రాలు..

● స్వాభిమాన్ ఏరియాలో ఆకట్టుకున్న గుర్రపు పందేలు

- IIలో





మార్గం.. సుగమం

- IIలో

న్యూస్‌రీల్

ఒడిశా ఈ-అబ్కారీకి జాతీయ అవార్డు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి డిజిటల్ ఇండియా గోల్డ్ అవార్డు స్వీకరిస్తున్న సుశీల్‌కుమార్ లోహానీ

భువనేశ్వర్: రాష్ట్ర ఎక్సైజ్ విభాగం దైనందిన కార్యకలాపాల్లో వినియోగిస్తున్న ఈ-అబ్కారీ వ్యవస్థ ప్రతిష్టాత్మక డిజిటల్ ఇండియా గోల్డ్ అవార్డు సాధించింది. ఈ మేరకు న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుశీల్‌కుమార్ లోహానీ అవార్డును స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 5టీ కార్యక్రమాల్లో భాగంగా ఎన్‌ఐసీ సంస్థ సాంకేతిక పర్యవేక్షణలో 2019-20 నుంచి ఎక్సైజ్‌శాఖ ఈ-అబ్కారీ విధానం ప్రవేశ పెట్టింది. విభాగం దైనందిన కార్యకలాపాల్లో 30కి పైగా సేవలను ఈ వ్యవస్థలో నిర్వహిస్తున్నారు. ఈ-లాటరీ, తక్షణ సమస్యల సత్వర పరిష్కారం, ఎక్సైజ్ లైసెన్స్‌ల పునరుద్ధరణ, 100శాతం ఆన్‌లైన్ చెల్లింపుతో బ్రాండ్ లేబుల్ రిజిస్ట్రేషన్లు, సమయానుకూల సర్వీస్ డెలివరీని పారదర్శకంగా నిర్వహించడంలో ఈ విధానం దోహదపడుతోంది.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



గంగాపూర్ పోలీసుల అదుపులో నిందితులు

బరంపురం: జిల్లాలోని కరియాగుడ గ్రామంలో డిసెంబర్ 13న జరిగిన డాక్టర్ రౌత్ కుమారుడు అమర్‌కుమార్ రౌత్ హత్య కేసులో ముగ్గురు నిందితులను గంగాపూర్ పోలీసు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఐఐసీ అధికారి సురేంద్రకుమార్ సాహు తెలిపిన వివరాల ప్రకారం.. గంజాం జిల్లా గంగాపూర్ పోలీసు స్టేషన్ పరిధి కరియాగుడ గ్రామానికి చెందిన వైద్యుడు రౌత్ కుమారుడు అమర్‌కుమార్‌ను దుండగులు హత్య చేసి, పరారయ్యారు. దీనిపై పోలీసు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా బరంపురం రైల్వేస్టేషన్‌లో ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వీరిలో సౌమ్యరంజన్ మహాపాత్రో, దీపక్‌కుమార్ ప్రధాన్, సురేష్‌కుమార్ రౌలో ఉన్నారు. వారి వద్ద నుంచి ఓ బైక్, మారణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

2 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో నిందితులు

జయపురం:

మల్కన్‌గిరి జిల్లా కలిమెల నుంచి జయపురం మీదుగా నవరంగపూర్ జిల్లా కొశాగుమడకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని జయపురం ఎక్సైజ్ అధికారి ధ్రుబధల్ బిశ్వాల్ శనివారం వెల్లడించారు. నిందితులు మల్కన్‌గిరి జిల్లా ఓర్కెల్ పోలీసు స్టేషన్ పరిధి ఎంవీ-109 గ్రామానికి చెందిన రాజేంద్ర మండల్, నువాగుడ గ్రామానికి చెందిన కవిరాజ్ గొలారిగా గుర్తించారు. కలిమెల నుంచి వాహనంలో గంజాయి రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం ప్రకారం ఎక్సైజ్ ఎస్పీ అరుణ కుమార్ పాఢి ఆదేశాలతో సిబ్బంది జయపురం-బొయిపరిగుడ మార్గం బలియ వంతెన వద్ద మాటు వేశారు. అటుగా వస్తున్న బొలేరోను తనిఖీ చేయగా 8 బస్తాల్లో 2 క్వింటాళ్ల గంజాయి బైటపడింది. దీని విలువ రూ.20 లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేశారు. దాడిలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సంజయకుమార్ కండి, ఏఎస్‌ఐ ఎం.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వాదనలు

- మాలి పర్వత తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి
- అనుమతిస్తే అభివృద్ధి చేస్తామన్న హిందాల్కో కంపెనీ ప్రతినిధులు
- వన్య సంపదను వదులుకునేది లేదని స్పష్టంచేసిన గిరిజనులు
- పూర్తి నివేదికను హైకోర్టుకు సమర్పించనున్న అధికారుల బృందం



సభ దారుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు



వేదికపై కలెక్టర్ అక్తర్, న్యాయమూర్తి సత్యనారాయణ, ఏడీఎం రాజేంద్ర, బిశ్వాల్

కొరాపుట్: మాలి పర్వత తవ్వకాలపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి పొట్టంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కుడి గ్రామ పంచాయతీ కొంకర అంబ గ్రామ సరిహద్దులో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య సభ చేపట్టగా.. హైకోర్టు ఆదేశాలతో కొరాపుట్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యనారాయణ మిశ్రా, కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్, ఏడీఎం రాజేంద్ర మాఝి, పర్యవరణ శాఖ రీజనల్ అధికారి బిపేష్ బిశ్వాల్ వేదికపై ఉన్నారు. తొలుత వాదనలు వినిపించిన హిందాల్కో కంపెనీ ప్రతినిధులు.. తాము ఈ ప్రాంతంలో గనులు తవ్వకాలు చేయడానికి ప్రభుత్వ అనుమతి పొందామని తెలిపారు. ప్రజలు మద్దతిస్తే తవ్వకంతో పాటు ప్రజలకు ఉన్నత జీవన విధానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామానికి రహదారులు, వైద్యం, మురుగు కాలువలు, తాగునీరు, నాణ్యమైన విద్య, మహిళలకు ఆర్థిక స్వావలంభన, పురుషులకు ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు తదితర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ప్రకటించారు.

హైకోర్టు ఆదేశాలతో..

రాష్ట్ర హైకోర్టు విధించిన ఆదేశాలతో అధికార యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. గనుల ప్రభావిత గ్రామల సరిహద్దుల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో వెళ్లే ఏ వ్యక్తులను విడిచి పెట్టకుండా తనిఖీలు చేశారు. చివరకు పట్టణాలకు కూరగాయలు విక్రయించే గిరిజన మహిళల బుట్టలు కూడా తనిఖీ చేశారు. ఆకస్మిక అగ్ని ప్రమాదాల దృష్టిలో పెట్టుకొని అగ్నిమాపక యంత్రాలు మొహరించారు. మొత్తం కార్యక్రమం వీడియో చిత్రీకరణ చేశారు. మైక్‌లు, నినాదాలు, గిరిజన సంప్రదాయ వాయిద్య పరికరాలు నిలువరించారు. సభ వివరాలు ఈనెల 15లోగా రాష్ట్ర హైకోర్టుకు నివేదించనున్నారు. ఈనెల 30న ఈ వివాదంపై హైకోర్టు విచారణ చేపట్టనుంది.

ప్రకృతిలో మమేకం..

అనంతరం మాట్లాడిన మాలి పర్వత సురక్ష సమితి సభ్యులు తామ ఎట్టి పరిస్థితుల్లోనూ గనులు తవ్వకాలను అంగీకరించమన్నారు. మాలి పర్వతం తమకు తరతరాలుగా అండగా నిలుస్తున్న దేవతగా పేర్కొన్నారు. పర్వత అటవీ ప్రాంత ఉత్పత్తులు, జల వనరులు, వన్యప్రాణులు, ప్రకృతితో తమ జీవితాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయన్నారు. భావి తరాలకు మాలిపర్వతం ఒక ఆదర్శంగా అభివర్ణించారు. తరతరాలుగా తాము ఈ పర్వతాన్ని రక్షించుకుంటున్నామని, ఇదే విధానం భవిష్యత్‌లో కొనసాగుతుందని స్పష్టంచేశారు. అధిక సంఖ్యలో గిరిజనులు ఇదే అభిప్రాయం వెల్లబుచ్చారు. అనంతర గనుల తవ్వకాన్ని సమర్థిస్తున్న కొందరు యువకులు మాట్లాడారు. ఈ తవ్వకాల వల్ల తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వాదించారు. దీంతో ఇరువైపులా నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలను సముదాయించారు.

చేతికి పసుపు రిబ్బన్..

సభా ప్రాంగణానికి మాలి పర్వత సురక్ష సమితి సభ్యులు శాంతియుత ర్యాలీలతో వచ్చారు. ప్రతి గ్రామం నుంచి జాతీయ పతాకాన్ని చేతపట్టి వేర్వేరుగా కదిలారు. పోలీసులకు ఇచ్చిన హామీ ప్రకారం తమ సంప్రదాయ ఆయుధాలు విడిచిపెట్టి హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ తమ చేతికి పసుపు రిబ్బన్ కట్టుకొని బల ప్రదర్శన చూపించారు. దీంతో పర్వత తవ్వకాల వ్యతిరేకులు, అనుకూలమైన వారి బలబలాలు బహిరంగంగా కనిపించాయి. ఇదే విధంగా సుమారు 80 లిఖిత పూర్వక ఫిర్యాదులు అధికారులకు అందజేశారు.

గత పరిణామాల నేపథ్యంలో..

గతంలో జరిగిన 2 ప్రజాభిప్రాయ సేకరణ సభలు రణరంగంగా మారాయి. గిరిజనులు అధికారులను తరిమికొట్టారు. దీంతో పోలీసులు ఈ విడత గట్టి చర్యలు తీసుకున్నారు. కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ్ శుంకర్ దగ్గరుండి అన్ని భద్రతా చర్యలు తీసుకున్నారు. ముగ్గురు ఏఎస్పీలు, ఐదుగురు ఎస్‌డీపీఓలు, 22 ప్లాటూన్ల పోలీసులను మొహరించారు. సభకు 5అంచెల భద్రత చేపట్టారు. మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో వారి సానుభూతి పరుల మీద నిఘా పెట్టారు. పర్వత పరిధిలోని దొళాయిపుట్, పక్కజోల, కుడి, సారిసిపాదర్ పంచాయతీల పరిధిలోని సుమారు 20గ్రామాల వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.



గిరిజనుల కూరగాయల బుట్టలు తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రధాన మార్గంలో భారీగా మొహరించిన పోలీసు బలగాలు



జాతీయ పతాకాలతో ర్యాలీగా వస్తున్న సురక్ష సమితి సభ్యులు



సభలో తవ్వకాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గిరిజనులు

భువనేశ్వర్-రౌర్కెలా విమానయానం

- ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్:

భువనేశ్వర్-రౌర్కెలా ప్రాంతాలకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అలయన్స్ విమానయాన సంస్థ ఈ సేవలు అందిస్తోంది. ఈ మార్గంలో తొలి విమాన సేవలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం జెండా ఊపిప్రారంభించారు. ఆయనతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, రవాణాశాఖ మంత్రి తుకుని సాహు, మంత్రి అశోక్ పండా హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి జ్యోతిరాదిత్య సింధియా పాలుపంచుకున్నారు.



విమాన సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం నవీన్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ఈనెల 12 నుంచి అందుబాటులోకి..

భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రూర్కెలాకు ప్రారంభమైన 72 సీట్ల విమానం నియమమిత సర్వీసులు ఈనెల 12నుంచి అందుబాటులోకి వస్తాయి. భువనేశ్వర్-రౌర్కెలా టికెట్టు ధర రూ.2,830లు కాగా.. తిరుగు ప్రయాణంలో రూ.2,721లు ఉంటుంది. ఈ విమానం నిత్యం మధ్యాహ్నం 2:55 గంటలకు భువనేశ్వర్ నుంచి బయలుదేరి 3:50 గంటలకు రౌర్కెలా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రౌర్కెలా నుంచి సాయంత్రం 4:15 గంటలకు బయలుదేరి, 5:10 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

ప్రయాణికులకు స్వాగతం..

భువనేశ్వర్ నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరిన అలయెన్స్ ఎయిర్(ఏటీఆర్ 72) మధ్యాహ్నం 12:07 గంటలకు రౌర్కెలా చేరింది. ఈ సందర్భంగా స్థానిక స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ అతున్ భౌమిక్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, తదితర ఉన్నతాధికారులు హాజరై ప్రయాణికులకు గులాబీలు అందజేసి స్వాగతం పలికారు. తిరుగు ప్రయాణంలో రౌర్కెలా విమానాశ్రయం నుంచి 67మంది ప్రయాణికులు భువనేశ్వర్‌కు బయలుదేరారు.



రౌర్కెలా విమానాశ్రయంలో ప్రయాణికుల సందడి

పౌష్టికాహార లోపం నివారణకు చర్యలు

- బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసిన మంత్రి రణేంద్రప్రతాప్



బాలింతలకు పోష్టకాహారం కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి రణేంద్ర ప్రతాప్

మల్కన్‌గిరి: జిల్లాలో పౌష్టికాహార లోపం నివారణకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ, పోషకాహార శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వాయి తెలిపారు. చిత్రకొండ సమితి జనత్పైయి పంచాయతీలో మంత్రి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. మాతా, శిశు మరణాలను అరికట్టడంతో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 జిల్లాల్లో పోషకాహార లోపంతో బాధపడే మహిళలను గుర్తించి, సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారికి అంగన్‌వాడీల ద్వారా ఆకుకూరలు, పాలు, పండ్లు పంపిణీ చేసేందుకు ఆలోచిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సేవకుల నూతన కార్యవర్గం ఎన్నిక



పాల్గొన్న దేవదాయ మందిరాల సేవకులు

జయపురం: పట్టణంలోని దేవదాయ ధర్మదాయ విభాగంలో ఉన్న వివిధ మందిరాలలో పూజారులు, సేవకులుగా పనిచేస్తున్న వారంతా స్థానిక బంకమఠం ప్రాంగణంలో శనివారం సమావేశమయ్యారు. ఇందులో జయపురం, గుప్తేశ్వర్, రామగిరి, బలిపూజారిపుట్ మందిరాలకు చెందిన 60మందికి పైగా సేవకులు పాల్గొని, తమ సమస్యలపై చర్చించారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా ధీరేంద్రకుమార్ రథ్, కార్యదర్శిగా కాశీప్రసాద్ దాస్, ఉపాధ్యక్షుడిగా డొంబురు దొర పండా, కోశాధికారిగా బలరాం పండా ఎన్నికయ్యారు.

ఆకట్టుకున్న పోటీలు



పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు

పట్టణంలోని బృందావన్ ప్యాలెస్‌లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పెయింటింగ్, వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. పర్లాకిమిడి లోని ఇంగ్లిష మీడియం పాఠశాలల విద్యార్థులతో పాటు పాతపట్నం సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు సైతం హాజరయ్యారు. తెలుగు సొండివీధి వద్ద ఉన్న స్మార్ట్ స్కూల్ నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 150 మంది చిన్నారులు పాల్గొన్నారు.

– పర్లాకిమిడి

ఆట ఆరంభం..



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న నిర్వాహకులు

పట్టణంలోని ప్రసాద్ టెక్నో స్కూల్‌లో వార్షిక క్రీడోత్సవాలను పాఠశాల డైరెక్టర్ జీవీ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెండా ఎగురువేసి, క్రీడా జ్యోతిని ఊరేగింపుగా తీసుకువెళ్లి మజ్జిగౌరి మందిరం వద్ద పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ర్యాలీ చేపట్టారు. ఈనెల 11వరకు క్రీడోత్సవాలు జరుగనున్నాయని తెలిపారు.

– రాయగడ

ఆత్మరక్షణపై అవగాహన



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి పాత అంచల, టెంగర గ్రామాల్లోని ఉన్నత పాఠశాల్లో బొరిగుమ్మ అగ్నిమాపక సిబ్బంది శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రకృతి వైపరిత్యాలు, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆత్మ రక్షణపై అగ్నిమాపక అధికారి దూరదక్ష దాస్, నారాయణ సాహు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– జయపురం

క్లుప్తంగా

12 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 18 వరకు ఏడు రోజుల పాటు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని డీఈఓ గార పగడాలమ్మ తెలిపారు. సెలవుల్లో పాఠశాలలు తెరిచినా, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర కాలనీకి చెందిన చక్క త్రినాథరావు(63) ఈ నెల 5న రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మురపాక గోవింద శనివారం తెలిపారు. వీఆర్వో శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్రినాథరావు కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు శనివారం రాత్రే దహనం చేశారు. త్రినాథరావుకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం


వాసెట్టి దామోదర్(ఫైల్)

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు, స్థానిక ఎంపీటీసీ భర్త వాసెట్టి దామోదర్ (52) ట్రాక్టర్ నుంచి జారిపడి మృతి చెందారు. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామోదర్ తన పొలంలోని ధాన్యం తీసుకురావడానికి శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై వెళ్లారు. అదుపు తప్పి జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన బారువ సామాజిక ఆస్పత్రికి తరలించగా మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వాసెట్టి సుజాత 2013–18 వరకు సర్పంచ్‌గా, ప్రస్తుతం అధికార పార్టీ ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త పిరియా సాయిరాజ్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ బుద్దాన రోహిణి తదితరులు సంతాపం తెలియజేశారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

యువశక్తి సభకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

లావేరు: లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామం వద్ద ఈనెల 12వ తేదీన జనసేన పార్టీ ఆధ్వర్యంలో యువశక్తి భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వస్తారని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన శనివారం తాళ్లవలస గ్రామానికి వచ్చి యువశక్తి సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు భరోసా కల్పించి వారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో వివేకానంద జయంతి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సభకు ఎస్పీ అనుమతి ఇచ్చారని తెలిపారు. యువశక్తి కార్యక్రమం కోసం ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకూ ఫోన్ కాల్స్ స్వీకరిస్తే ఇప్పటివరకూ 6వేల మంది కాల్స్ ద్వారా, రెండు వేల మంది ఈమెయిల్స్ ద్వారా ఆసక్తి చూపారని తెలిపారు. కార్యక్రమంలో 100 మంది యువతతో పవన్‌కల్యాణ్ మాట్లాడి వారితో సభలో మాట్లాడిస్తారని పేర్కొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసుల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : తీవ్ర నేరాలలో సమగ్ర దర్యాప్తుతో ముందుకు సాగాలని, అపరిష్కృతంగా ఉన్న హత్య, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ, వరకట్నం, మహిళలపై నేరాలు వంటి కేసులను వేగంగా ఛేదించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సబ్ డివిజన్, సర్కిల్ వారీ పోలీసు అధికారులతో పలు కీలకాంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, పోక్సో, అత్యాచార కేసుల నమోదు, దర్యాప్తు, ఆస్తి నేరాలలో రికవరీ, ముద్దాయిల అరెస్టులపై దృష్టి సారించాలన్నారు. దర్యాప్తులో వెల్లడైన అంశాలు, సాక్ష్యాధారాలు బట్టి దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు, ఫోరెన్సిక్ నిపుణుల ఆధారాల సేకరణ, కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సూచనలు పాటిస్తూ కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. నేరస్తులను గుర్తించేందుకు సాంకేతికతను ఉపయోగించాలన్నారు. ముఖ్య కూడళ్లు, షాపింగ్ కాంప్లెక్సులు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, దేవాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గస్తీ పెంచాలన్నారు. రాత్రి నిఘా పెంచాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ (క్రైం) టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు మహేంద్ర మాతే, ఎస్.బాలరాజు, సీహెచ్‌వీవీ ప్రసాదరావు, శివరామిరెడ్డి, విజయ్‌కుమార్, వాసుదేవ్, సీఐలు పాల్గొన్నారు.

మార్గం.. సుగమం

- రాయగడ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రప్రభుత్వం
- రూ.453.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు
- పనుల ప్రారంభానికి త్వరలో టెండర్ల ఆహ్వానం


సమావేశంలో పాల్గొన్న ఎంపీ సప్తగిరి, ఎమ్మెల్యే ముదులి, ఏడీఎం ప్రధాన్ తదితరులు


భుజబల్ వద్ద సర్వేలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


అధికారులు విడుదల చేసిన ప్రతిపాదిత రోడ్డు మ్యాప్

రాయగడ: ట్రాఫిక్ వ్యవస్థ క్రమబద్ధీకరణలో భాగంగా రాయగడలో ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. 13 కిలోమీటర్ల పొడవునా బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కేంద్ర రోడ్డు, రవాణా, హైవే శాఖ సుమారు 453.10 కోట్ల రుపాయల నిధులను మంజూరు చేసింది. త్వరలో నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జాతీయ రహదారుల శాఖ(ఎన్‌హెచ్)సునాబెడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సొమర్జిని సెఠి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బహిరంగ సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇందులో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, ఏడీఎం సోమనాథ్ ప్రధాన్, సబ్ కలెక్టర్ భీమసేన్ సాబోర్, ఎన్‌హెచ్ రాయగడ శాఖ ఎస్‌డీఓ బిక్రం పాణిగ్రాహి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ ఈఈ సెఠి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రాయగడ జిల్లా ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న బైపాస్ రోడ్డు కల నిజం కానుందని వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణానికి సంబంధించి డిజైన్ పనులు పూర్తి చేశామన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని భుజబల్ నుంచి రోడ్డు పనులు ప్రారంభమై.. అమలాభట్ట, బాకురుగుడ, వీరనారాయణపూర్, చందిలి, కొమట్లపేట, కొట్లాగుడ, సింధుబారి, సింగనాపూర్, సిరిగుడ, సిరికోన వరకు నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. సుమారు 13 కిలోమీటర్ల పొడవున నిర్మితం కానున్న ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా 2పెద్ద వంతెనలు, మరో 16 కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన తుది మ్యాప్‌ను విడుదల చేశారు.

బైపాస్ రోడ్డు ఆవశ్యతక

అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో బృహత్తర పరిశ్రమలు ఏర్పాటైన నేపథ్యంలో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు రాయగడ మీదుగా ఆంధ్ర, తెలంగాణా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు రాకపోకలు చేస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో బైపాస్ రోడ్డు నిర్మాణం ఆవశ్యతకపై లోక్‌సభలో ప్రస్తావించినట్లు ఎంపీ సప్తగిరి ఉలక తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్రప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే నిర్మాణ పనులు చురుగ్గా ప్రారంభించాలని, సంబంధిత శాఖ యుద్ధ ప్రాదిపదికన పనులు ప్రారంభించాలని సూచించారు. ఇదిలా ఉండగా బైపాస్ నిర్మాణంలో భాగంగా అవసరమయ్యే 178.508 ఎకరాల ప్రైవేట్, ప్రభుత్వ, అటవీ భూములు అవసరమవుతున్నట్లు గుర్తించామన్నారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు.

మరోసారి సర్వే..

బైపాస్ నిర్మాణం పనుల్లో భాగంగా స్థానిక భజబల్ ప్రాంతంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమావేశం అనంతరం మరోసారి సర్వేచేశారు. ఎక్కడి నుంచి రోడ్డు ప్రారంభమవుతుంది? నాగావళి నదిపై ఎన్ని వంతెనలు నిర్మాణం అవసరం అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే ప్రతిపాదిత ప్రాంతాల్లో ఉండే ప్రజలు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు.

రేసు గుర్రాలు..


దౌడు తీసేందుకు సిద్ధంగా ఉన్న గుర్రాలు


ప్రతిభ చూపిస్తున్న పోటీదారులు


పోటీదారుడిని అభినందిస్తున్న రాష్ట్రమంత్రి రాణేంద్ర ప్రతాప్

- స్వాభిమాన్ ఏరియాలో ఆకట్టుకున్న గుర్రపు పందేలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా పెప్పరమెట్ల పంచాయతీలో మాల్యవంత్ మహోత్సవాల్లో భాగంగా శనివారం గుర్రపు పందేలు నిర్వహించారు. తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీలను రాష్ట్ర వ్యవసాయ, పోషికాహార శాఖామంత్రి రాణేంద్ర ప్రతాప్ స్వాయి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్వాభిమాన్ ఏరియాను కటాఫ్ ప్రాంతంగా పిలిచేవారని, మావోయిస్టుల ప్రభావంతో అభివృద్ధిలో వెనుకుండి పోయిందన్నారు. రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో స్థానిక గిరిజనులు గుర్రాలనే రాకపోకలకు వినియోగించేవారని గుర్తుచేశారు. అయితే గురుప్రియ వంతెన నిర్మాణంతో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, మెరుగైన రహదారులు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం అభివృద్ధి పథంలో అడుగులు వేస్తూ రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ గిరిజనులకు చేరుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు ఈ పోటీల్లో 30మంది యువకులు పాల్గొనగా, మూడు దశల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో రాజు ఖీలో ప్రథమ స్థానంలో నిలవగా, సమాద్ పంగి, సుభాష్ ఖీలో తరువాతి స్థానాలు దక్కించుకున్నారు. విజేతలకు ఈనెల 15 నుంచి జరగనున్న జిల్లాస్థాయి మాల్యవంత్ ఉత్సవాల్లో బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ విశాల్‌సింగ్, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, ఆర్థికశాఖ కార్యదర్శి అరవింద పిఢికార్, నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సోమారీ టంగులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై గ్రామస్తుల దాడి

- గంజాయి మొక్కలు ధ్వంసం చేస్తుండగా అనూహ్య ఘటన


పోలీసులపై దాడి చేస్తున్న గ్రామస్తులు


ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మహిళా కానిస్టేబుల్


కొరాపుట్: గంజాయి బస్తాలను పరిశీలిస్తున్న ఎస్పీ సుశ్రీ

మల్కన్‌గిరి: జిల్లాలోని పరజగూడ గ్రామంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేసేందుకు వెళ్లిన పోలీసులపై గ్రామస్తులు దాడి చేసిన అనూహ్య ఘటన ఎదురైంది. బలిమెల పోలీస్ స్టేషన్ పరిధి నక్కమాముడి పంచాయతీ పరజాగూడ, డైక్–1 గ్రామాలకు చెందిన సుమారు 200మంది గిరిజనులు పోలీసులపై దాడి చేసి, గాయపరిచారు. తమ జీవనోపాధిగా ఉన్న గంజాయి పంటను ధ్వంసం చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని, అందుకే దాడి చేశామని గ్రామస్తులు చెప్పుకొచ్చారు. ఈ దాడిలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐ, హోంగార్డు గాయపడ్డారు. మరో హోంగార్డును గ్రామస్తులు చెట్టుకు కట్టి, బంధించారు. విషయం తెలుసుకున్న చిత్రకొండ ఎస్‌డీపీఓ అలెక్స్ కిరసాని హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామస్తులతో చర్చించి, వారి వద్ద ఉన్న హోంగార్డు వాసును విడిపించారు.

భారీగా గంజాయి దగ్ధం

కొరాపుట్: వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని నవరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ దగ్ధం చేయించారు. నవరంగ్‌పూర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన గంజాయి రక్షణ కష్టసాధ్యంగా మారింది. దీంతో కోర్టు అనుమతితో గంజాయిని ధ్వంసం చేసేందుకు జిల్లా పోలీసులు శ్రీకారం చుట్టారు. కొసాగుమగుడ, నవరంగ్‌పూర్, కొడింగా, పపడాహండి పోలీస్ స్టేషన్లలో 20 కేసుల్లో పట్టుబడిన 2,936 కిలోల గంజాయిని దమన్‌జోడి వద్ద ఉన్న భారత అల్యూమినియం కేంద్రం(నాల్కో)లో దగ్ధం చేయించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎస్పీ ఎస్.సుశ్రీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

కల్యాణ సింగుపూర్‌లో చౌయితి సంబరాలు


నదీ జలాలను కళశాలతో తీసుకువస్తున్న మహిళలు


పూజలు నిర్వహిస్తున్న సమితి అధ్యక్షురాలు కద్రక

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో చౌయితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సమితి అధ్యక్షురాలు అంబిక కద్రక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సమీపంలోని కల్యాణి నది నుంచి 32 కలశాల్లో శుద్ధ జలాలను సేకరించి, సమితి ప్రాంగణంలొ ఏర్పాటు చేసిన వేదిక వద్ద నిలిపారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు బరాటం వరప్రసాదరావు, సమితి ఉపాధ్యక్షుడు డొంబురు కంజిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొత్తూరు: మండలంలోని మాతల బ్రిడ్జి వద్ద ఈ నెల 5న రూ.1,04,500 విలువైన 27.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఎస్‌ఐ గోవిందరావు, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని స్థానిక ఎంఎల్ఎస్ గోదాముకు అప్పగించినట్లు సీఎస్‌డీటీ రవికుమార్ శనివారం తెలిపారు. కొత్తూరు మండలం కాశీపురం నుంచి ఒడిశా రాష్ట్రం హడ్డుబంగి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మహిళా సంఘాలకు మహర్దశ

- 26,722 ఎస్‌హెచ్‌జీ బృందాలకు రుణ సౌకర్యం
- రూ.1001 కోట్లు కేటాయించిన సీఎం నవీన్ పట్నాయక్
- రాష్ట్రంలో మెగా రుణ కార్యక్రమం ప్రారంభం


మిషన్‌శక్తి మహిళలకు రూ.10 లక్షల రుణానికి సంబంధించి చెక్ అందిస్తున్న నవీన్ పట్నాయక్


ఏటీఎం మొబైల్ వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం నవీన్

భువనేశ్వర్: రాష్ట్రంలో మెగా రుణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ లోక్‌సేవా భవన్ నుంచి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఒడిశా గ్రామ్య బ్యాంక్ ఆధ్వర్యంలో 26,722 మహిళా స్వయం సహాయక బృందాలకు(ఎస్‌హెచ్‌జీ) రూ.1001 కోట్ల రుణాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ రుణాల ద్వారా 2.68 లక్షల మంది మహిళలకు లబ్ధి కలుగనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరైన 5 మిషన్ శక్తి గ్రూపులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల రుణాన్ని ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత సాధనలో ఒడిశా అగ్రగామిగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర మిషన్‌శక్తి కార్యక్రమంలో బ్యాంకర్లు పాలుపంచుకుని మహిళా సాధికారత కార్యక్రమం విజయవంతంగా ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఒడిశా పరివర్తనలో బ్యాంకర్ల భాగస్వామ్యం అత్యంత కీలకంగా పేర్కొన్నారు. జిల్లాస్థాయి సమాఖ్యలకు రూ.కోటి, మండల స్థాయి సమాఖ్యలకు రూ.50 లక్షల చొప్పున రివాల్వింగ్ ఫండ్ అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పాటు మహిళలకు వడ్డీ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇచ్చే ఏర్పాట్లు చేశామన్నారు. మిషన్‌శక్తి కార్యక్రమం విజయవంతంగా ముందుకు నడిపించిన ఒడిశా గ్రామ్య బ్యాంకు మేక్ ఇన్ ఒడిశా కాన్‌క్లేవ్‌లో ఉత్తమ ప్రోత్సాహక బ్యాంక్‌గా అవార్డు సాధించిందని వివరించారు.

గ్రామాల్లో సంచాలక మొబైల్ సేవలు

ఈ సందర్భంగా 5 బహుళార్థ ప్రయోజనాల మొబైల్ వ్యాన్ కమ్ ఏటీఎంలను నవీన్ జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సేవల విస్తరణ కార్యక్రమం మరింత పుంజుకుంటుందని ఆకాంక్షించారు. గ్రామీణ మహిళలకు రుణాలు అందించడంలో ఒడిశా గ్రామ్య బ్యాంక్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అభినందించారు. ఈ నేపథ్యంలో గత ఆరేళ్లుగా ఈ బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ అవార్డు నిరవధికంగా సాధించడం తార్కాణంగా పేర్కొన్నారు.

బ్యాంకులు సహకరించాలి..

రాష్ట్ర ఆర్థికమంత్రి నిరంజన్ పూజారి ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మిషన్‌శక్తి కార్యక్రమం ప్రోత్సాహానికి రుణ పరిమితి విస్తరించనున్నట్లు ప్రకటించారు. రూ.4 లక్షల రుణ పరిమితి పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికి బ్యాంకులు సహకరించాలని కోరారు. మిషన్‌శక్తి వర్గాలు ముఖ్యమంత్రి సంకల్ప సాధనకు విశేష కృషి చేస్తున్నారన్నారు. రుణాల చెల్లింపులో మహిళలు ముందుంటున్నారని రాష్ట్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి బాసంతి హెంబ్రామ్ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మిషన్‌శక్తి విభాగం కమిషనర్ సుజాత కార్తికేయ మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో ప్రతిభ ప్రదర్శించి సత్తా చాటుకోవాలని ప్రేరేపించారు. మహిళా స్వయం సహాయక బృందాలకు పంచవర్ష ప్రణాళిక కింద రూ.50 వేలు చొప్పున వడ్డీ రహిత రుణాలు మంజూరు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని సగర్వంగా ప్రకటించారు. కార్యక్రమం కింద రాష్ట్రప్రభుత్వం సమగ్రంగా రూ.1200 కోట్ల వడ్డీ మాఫీ చేస్తుందన్నారు.

కె.నౌపడ భూములకు ఎకరాకు రూ.26 లక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట గ్రామస్తుల పునరావాసం కోసం కె.నౌపడ గ్రామంలోని భూములను ఎకరా రూ.26 లక్షలకు కొనుగోలు చేసేందుకు ధర నిర్ణయించినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కె.నౌపడ రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని, కె.నౌపడలో పునరావాసం కోసం 54 ఎకరాలు కావాల్సి ఉండగా 34 ఎకరాల భూములను ఒక ఎకరం భూమి రూ.26 లక్షలకు కొనడానికి నిర్ణయించినట్లు తెలిపారు. మిగిలిన భూమిని సేకరణ చేయనున్నట్లు తెలిపారు. మూలపేట గ్రామస్తుల పునరావాసం కోసం కె.నౌపడ గ్రామంలో ఎకరం భూమి రూ.26 లక్షలకు కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు.

గిరిజన ఆశ్రమాల్లో అక్రమాలు

- బుడంబో హెచ్‌ఎం సస్పెన్షన్

మందస: గిరిజన ఆశ్రమాల్లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అవకతవకలతో పాటు విద్యార్థినులను వేధింపులకు గురిచేసినట్టు ఆరోపణలు రావడంతో ఐటీడీఏ యంత్రాంగం రహస్యంగా దర్యాప్తు చేపట్టింది. మందస మండలంలో బుడంబో, పట్టులోగాంలో గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలున్నాయి. ఇటీవల బుడంబో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సవర ఆనందరావుపై రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, మెనూ సక్రమంగా పెట్టడం లేదన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఐటీడీఏకు చెందిన పీఆర్‌ఆర్సీ విభాగం ఆఫీస్ ఆన్ స్పెషల్ డ్యూటీ యుగంధర్ దర్యాప్తు చేపట్టగా ఆరోపణలు రుజువు కావడంతో పీఓ బి.నవ్యకు నివేదించారు. అంతకుముందు ఇదే ఆశ్రమంలో ఇంగ్లిషు సబ్జెక్టును బోధిస్తున్న పాతపట్నం మండలానికి కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ కె.కుమారరాజు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవరిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో ఐటీడీఏ జీసీడీఓ రాములమ్మ దర్యాప్తు చేపట్టారు. నివేదికను పీఓకు అందజేయడంతో చర్యలకు సిద్ధమవుతున్నారు. పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలో గణితం బోధిస్తున్న సీఆర్టీ గోపాల్ కూడా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నాడన్న ఆరోపణల మేరకు ఐటీడీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు. దీనిపైనా పీఓకు నివేదిక అందజేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రాజెక్టు అధికారి సీఆర్టీ గోపాల్‌పై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. ఈ విషయమై అసిస్టెంట్ ట్రైబల్ అధికారి మేడిద శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ బి.నగేశ్ ఆధ్వర్యంలో దర్యాప్తులు జరిగాయన్నారు.

క్లుప్తంగా

తాలాడలో గజరాజుల బీభత్సం



ఏనుగులు చెల్లాచెదురు చేసిన ధాన్యం కుప్ప

భామిని: మండలంలోని తాలాడ గ్రామంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం రాత్రి నాలుగు ఏనుగుల గుంపు ఒకటి గ్రామం చేరుకుని, అక్కడి కల్లాల్లో పోగు చేసిన ధాన్యం కుప్పలను ధ్వంసం చేశాయి. కొంత ధాన్యం తినివేయడంతో పాటు మరికొంత ధాన్యాన్ని చెల్లాచెదురు చేశాయి. గజరాజుల విధ్వంసంతో నష్టపోయిన రైతులు వలరౌతు లక్ష్మణరావు, వలరౌతు కిరణ్‌కుమార్ చేతికి వచ్చిన పంట ఇలా పోయిందేంటని తలలు పట్టుకుంటున్నారు.

తప్పిన పెనుప్రమాదం



పొదల్లో ఇరుక్కుపోయిన లారీ

భామిని: మండలంలోని పెద్దదిమిలి-చిన్నదిమిలి ప్రాంతాల మధ్యలోని ఏబీ రోడ్డులో పెద్దప్రమాదం తప్పింది. శనివారం వేకువ జామున అటువైపుగా వస్తున్న ఓ లారీ అదుపు తప్పి అక్కడి పొదల్లోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవరు, క్లీనరు లారీలో నుంచి కిందికి దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కొత్తూరు మండలంలోని స్టోన్ క్రషర్ నుంచి చిప్స్ తీసుకువచ్చి, తిరుగు ప్రయాణం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



జనార్ధనసాయి

కొత్తవలస రూరల్: మండలంలోని వీరభద్రపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కసిరెడ్డి జనార్ధనసాయి(24) అనే యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. విశాఖపట్నం పాస్‌పోర్టు ఆఫీసుకు వీసా పని నిమిత్తం వెళ్లి, తిరిగి స్వగ్రామం దేవరాపల్లి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. బెల్జియంలో షిప్‌లో చెఫ్‌కు అసిస్టెంట్‌గా ఎంపిక కావడంతో పోలీస్ ఎంక్వైరీ, వీసా కోసం విశాఖపట్నం వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



విచారణ చేపడుతున్న ఎస్‌ఐ మహేష్

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెంలో ఒక ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థకు కొందరు తమ లే అవుట్‌కు కరెంట్ కేబుల్ లైన్ వేసేందుకు పొలాల మీదుగా తవ్వకాలు చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న రైతులు శుక్రవారం రాత్రి తవ్వకాలను అడ్డుకున్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పొలాల్లో ఎలా తవ్వకాలు చేపడతారని స్థానికులు నీలాపు రామకృష్ణ, రాము, అప్పలసూరి, నీలాపు అప్పలరామిరెడ్డి, తదితరులు ప్రశ్నించారు. విషయం పోలీసులకు చేరడంతో ఎస్సై మహేష్, తదితరులు శనివారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



భక్తులకు ఆధ్యాత్మికోపన్యాసం ఇస్తున్న అహోబిల రామానుజ జియర్ స్వామి

బొండపల్లి: ఆధ్యాత్మికత చింతనతో గడిపే వారికి మానసిక ప్రశాంతత సొంతమవుతుందని అహోబిల జియర్‌స్వామి అన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో సద్గురు దేవానంద స్వామి 23వ ఆరాధనోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ముందుగా వేదపండితుల సమక్షంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులనుద్దేశించి అహోబిల జియర్‌స్వామి ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. మానవసేవయే మాధవ సేవగా భావించాలన్నారు. హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో మాన్యశ్రీ చంద్రశేఖర్, దేవానందస్వామి భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

కొండ పొలం

- సాగుకు వీలుకాని కొండ ప్రాంతంలో విస్తృతంగా పంటల సాగు
- ఉపాధి హామీ అధికారుల సహాయంతో పంటలు పండిస్తున్న గిరిపుత్రులు
- జోరుగా మామిడి, జీడిమామిడి మొక్కల పెంపకం
- సాగునీటి సరఫరాకు ప్రత్యేకంగా ఫారంపాండ్స్ ఏర్పాటు
- దాదాపు 60 ఎకరాల్లో సాగు



రామతీర్థంలో రాళ్లురప్పలు కలిగిన నేలలో సాగు చేసిన జీడిమామిడి పంట



సాగునీటి సరఫరా కోసం ఉపాధి హామీ నిధులతో తవ్వించిన ఫారంపాండ్స్



కొండ పైనుంచి వస్తున్న నీటిని సాగుకు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కాలువ



జీడిమామిడి తోటను పరిశీలిస్తున్న ఉపాధి హామీ అధికారులు

విజయనగరం ఫోర్ట్: చదును చేయడానికి వీలుకాని రాళ్లతో నిండిన కొండ ప్రాంతం అది. సాగు చేయడానికి ఏమాత్రం సహకరించని రాళ్ల నేల మధ్యలో డ్వామా(జిల్లా నీటి యాజమాన్య సంస్థ) అధికారులు గిరిపుత్రులతో సిరులు పండిస్తున్నారు. సాగుకు అసాధ్యమనుకున్న చోట సుసాధ్యం అని చేసి చూపిస్తున్నారు. మొక్కలు వేయడం దగ్గర నుంచి వాటిని పెంచే వరకు గిరిజనులకు అన్ని విధాలా సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఏడాది పాటు నిరంతర పర్యవేక్షణ ద్వారా ఆశించిన లక్ష్యాన్ని సాధించారు. డ్వామా అధికారులు వేతనదారులకు పని కల్పించడం, మెటీరియల్ వర్క్స్ చేయించడంతో పాటు పంటల సాగుకు అనువుగాని ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును సవాలుగా తీసుకుని మామిడి, జీడిమామిడి మొక్కల పెంపకం చేపట్టారు.

నెల్లిమర్ల, గంట్యాడ మండలాల్లో..

నెల్లిమర్ల మండలంలోని రామతీర్థాలు గ్రామానికి చెందిన 18 మంది గిరిజన రైతులకు 26 ఎకరాల భూమికి ప్రభుత్వం ఆర్‌ఓఆర్ పట్టాలను ఇచ్చింది. ఈ నేల అంతా రాళ్లురప్పలతో ఉంది. చదును చేయడానికి కూడా వీలుకాని పరిస్థితి. అయితే ఇదే భూమిని సాగులోకి తీసుకువచ్చి, గిరిజనులకు ఉపాధి కల్పించాలని డ్వామా అధికారులు నిర్ణయించారు. అనుకున్నట్టుగానే ఈ నేలలో మామిడి, జీడిమామిడి మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా నాటించారు. ఎకరానికి 70 మొక్కలు చొప్పున 2021లో నాటించారు. కొండ ప్రాంతం కావడంతో వాటికి నీటి సరఫరాకు అక్కడ బోరు కూడా వేయలేని పరిస్థితి. ఎలాగైనా మొక్కలకు నీరు అందించేందుకు ఉపాధి హామీ నిధులతో ఫారంపాండ్స్ తవ్వించారు. ఆ నీటిని కావిళ్లతో మోసి మొక్కలను పెంచారు. అలాగే కొండ పైనుంచి కిందకు పారే నీటిని మొక్కలకు తరలించారు. అక్కడి ఉపాధి హామీ సిబ్బంది కూడా ఏడాది పాటు వాటి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ మొక్కలన్నీ ఏపుగా పెరిగాయి. దీంతో రైతులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గంట్యాడలో 40 ఎకరాలకు పైగా..

గంట్యాడ మండలంలోని పెణసాం, నీలావతి, కితుబర్తి తదితర గ్రామాల్లో దాదాపు 40 ఎకరాలకు పైగా భూమిలో ఉపాధి హామీ నిధులతో మామిడి, జీడిమామిడి మొక్కల పెంపకం చేపట్టారు. ఇక్కడి కూడా మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం ఆయా పంటలు పూత దశలో ఉన్నాయి. దీంతో ఈ వేసవిలో పంట చేతికి వచ్చే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు శాశ్వత ఉపాధి..



రాళ్లురప్పలు అధికంగా ఉండి, సాగుకు వీలుకాని రామతీర్థంలో రైతులకు ఎలాగైనా శాశ్వత ఉపాధి కల్పించాలనుకున్నాం. మామిడి, జీడిమామిడి మొక్కలను రైతులతో వేయించి, సాగు చేయించాం. సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు నిరంతరం అందిస్తున్నాం. ప్రస్తుతం పంటలు బాగున్నాయి. మిగతా మండలాల్లోని రైతులకు కూడా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

అధికారుల సహకారం బాగుంది..



మాకు ఇచ్చిన భూమి సాగుకు అంత అనుకూలమైనది కాదు. అయితే డ్వామా అధికారుల సహకారంతో మామిడి, జీడిమామిడి పంటలు వేసుకున్నాం. సంవత్సరం పాటు ఆ మొక్కలు బతికేలా అధికారులు సహాయం చేసిన తీరు బాగుంది.

– ఇ.లక్ష్మి, మహిళా రైతు, రామతీర్థాలు

విమానాశ్రయానికి మంచినీటి సరఫరాకు చర్యలు



విమానాశ్రయానికి మంచినీటి సరఫరాపై అధికారులతో కలిసి చర్చిస్తున్న రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ సీఈఓ రవికుమార్

భోగాపురం-పూసపాటిరేగ: భోగాపురం మండలంలో నిర్మించనున్న విమానాశ్రయానికి మంచినీటి సరఫరాకు చర్యలు ప్రారంభమయ్యాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని నీటివనరులు, విమానాశ్రయ భూములను రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ సీఈఓ వి.రవికుమార్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విమానాశ్రయానికి మంచినీటి సరఫరాకు రూ.75 కోట్ల నిధులకు ప్రభుత్వం ప్రతిపాదన చేసిందని, అయితే విమానాశ్రయానికి ఒక్కరోజుకు 5 మిలియన్ల నీరు అవసరముంటుందన్నారు. ఈ మేరకు పూసపాటిరేగ మండలంలోని పాతనడిపిల్లి, కొప్పెర్లలోని చంపావతి నది, విశాఖపట్నం జిల్లాలోని ఆనందపురం దగ్గరున్న రిజర్వాయరు నుంచి విమానాశ్రయానికి నీటిని సరఫరా చేసేందుకు సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. మరోవైపు విమానాశ్రయానికి సమీపంలోని సముద్రం నుంచి కూడా నీటిని రీ-శానిటేషన్ చేసి, ఉపయోగించే విషయమై పరిశీలిస్తున్నామన్నారు. వీటిపై నివేదిక తయారు చేసి, ప్రభుత్వానికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఉమాశంకర్, జీఎంఆర్ సంస్థ జనరల్ మేనేజర్లు సుబ్బారావు, భాస్కరరావు, విమానాశ్రయ ప్రత్యేకాధికారి జి.అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జె.వైకుంఠరావు, జేఈ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజా లా కళాశాలను ప్రభుత్వమే నడపాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల తీర్మానం



సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: మహారాజ లా కళాశాలను ప్రభుత్వమే నడపాలని ప్రజా సంఘాల నాయకులు తీర్మానం చేశారు. శనివారం స్థానిక కోట వద్ద ఉన్న ఎస్ఎఫ్‌టీఈ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జిల్లాలోని ఏకైక లా కళాశాలను ఎత్తివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే 2023 అడ్మిషన్ లిస్ట్ నుంచి ఎంఆర్ లా కాలేజీని తొలగించారని తెలిపారు. జిల్లాలో 36 ఏళ్లుగా కొనసాగుతున్న లా కళాశాలను తొలగిస్తే చాలామంది లా చదువుకోవాలనుకుంటున్న విద్యార్థులు నష్టపోతారన్నారు. విద్యల నగరంగా పేరొందిన విజయనగరం జిల్లాలో ఎం.ఆర్ లా కళాశాల కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఇప్పటికే డిప్యూటీ స్పీకర్, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. జనవరి 9వ తేదీన మరోసారి ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తీర్మానం చేసి కలెక్టరుకి వినతిపత్రం అందిస్తామన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు రెడ్డి శంకరరావు, ఎం.ఆర్. లా కళాశాల విద్యార్థులు వెంకటరావు, ప్రకాష్, ఎం.ఆర్ ఎయిడెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయపాల్, విశ్వభూషణ్, డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర కార్యదర్శి బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: యువత మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక చైతన్య కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఎక్కువ మంది యువత చెడు అలవాట్లతో భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు అయిన వారు అందరినీ కోల్పోయి ఒంటరి వారుకావడంతోపాటు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. యువత సన్మార్గంలో పయనించి ఆధ్యాత్మికతను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, చల్లా శ్యాంప్రసాద్, ముదిలి శ్రీనివాసరావు, లావేటి శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

9న పీఈటీ లకు శిక్షణ

విజయనగరం: క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ఖేలో ఇండియా పథకంలో రిజిస్ట్రేషన్ చేసి వివరాలను అప్‌లోడ్ చేయడంపై ఈనెల 9వ తేదీన జిల్లాలోని అన్ని యాజమాన్యాల వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు రాజాం, చీపురుపల్లి, బొబ్బిలి నియోజకవర్గం వ్యాయామ ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం 1.30 నుంచి ఎస్.కోట, నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గం పీడీ, పీఈటీలకు శిక్షణ ఉంటుందన్నారు. నగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో విధిగా అన్ని పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు.

జెడ్పీ నిధుల నుంచి రూ.లక్ష విరాళం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: నెల్లిమర్ల మండలంలోని అలుగోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం అందజేశారు. జెడ్పీ నిధుల నుంచి కేటాయించిన ఈ నగదును స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో పోటీల నిర్వాహకులకు శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తుండడం చాలా ఆనందంగా ఉందని, జిల్లాకి పేరు వచ్చేలా పోటీల నిర్వహణ ఉండాలని అన్నారు. విజయనగరం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో అండర్-17 విభాగంలో బాలబాలికల కబడ్డీ పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజకుమార్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్.వి. రమణ, నెల్లిమర్ల మండల వైస్ ఎంపీపీ వైకుంఠనాయుడు, కబడ్డీ పోటీల నిర్వాహకులు పతివాడ శ్రీనివాసరావు, వ్యాయమ ఉపాధ్యాయుడు సూర్యారావు పాల్గొన్నారు.

క్రానిక్ ఓపీ ప్రారంభం



క్రానిక్ ఓపీని ప్రారంభిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈహెచ్ఎస్ క్రానిక్ ఓపీని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల, ఆస్పత్రి సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడు కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ పరిధిలోని ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లకు ప్రతిరోజూ ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం జనరల్ సర్జరీ, మంగళవారం జనరల్ మెడిసిన్, బుధవారం పెథాలజీ, గురువారం ఎముకలు, శుక్రవారం చర్మవ్యాధులు, శనివారం మళ్లీ జనరల్ మెడిసిన్ విభాగాలకు సంబంధించిన ఓపీ నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులకు వైద్య పరీక్షలతో పాటు చికిత్స కూడా అందించడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ బి.గౌరీశంకర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ ఉప్పు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



విజేతగా నిలిచిన విజయనగరం పాలిటెక్నికల్ కళాశాల బాలురు, బాలికల జట్లు

- విజేతగా విజయనగరం పాలిటెక్నిక్ కళాశాల జట్లు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఇంటర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ శనివారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా నుంచి 17 కళాశాలల నుంచి బాలబాలికల జట్లు పాల్గొనగా, విజేతగా ఎం.ఎం.ఆర్.ఎ.జి.ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లు(బాలురు, బాలికలు) నిలిచాయి. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంచూరియన్ వర్సిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ జి.జి.ఎస్.ఎన్. రాజు, డీసీఐ అసిస్టెంట్ డైరెక్టర్ వంశీమోహన్ చేతులమీదుగా విజేతలకు షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- డిపో మేనేజర్ శ్రీనివాసరావు



విజయనగరం టౌన్: సంక్రాంతి పండగకు దూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చేవారికి సాధారణ చార్జీలతోనే ఆర్టీసీ ప్రత్యేక లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం మాట్లాడుతూ విజయనగరం నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి విజయనగరానికి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులను ఈ నెల 9, 10, 11, 12 తేదీల్లో సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్టు స్పష్టం చేశారు. అలాగే, హైదరాబాద్ నుంచి విశాఖ వరకూ వచ్చే రైళ్లకు సంబంధించి కనెక్టివిటీగా ఆర్టీసీ బస్సులను విశాఖ రైల్వేస్టేషన్ నుంచి విజయనగరం మీదుగా పార్వతీపురం వరకూ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటుచేసిందన్నారు. పండగ తర్వాత 16, 17 తేదీల్లో బస్సులను మళ్లీ హైదరాబాద్‌కు నడుపుతామని, డిమాండ్ బట్టి మరో రెండురోజులు పొడిగించే అవకాశం ఉందన్నారు. పండగ రోజుల్లో ఆన్‌లైన్‌లో అప్‌అండ్‌డౌన్ టికెట్లను ఒకేసారి తీసుకున్న ప్రయాణికులకు పదిశాతం రాయితీ కల్పిస్తామని చెప్పారు. సీనియర్ సిటిజన్స్‌కు టిక్కెట్ చార్జీలో 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. విజయనగరం నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్ వరకు, తిరిగి విజయనగరం వచ్చేందుకు ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ ఉన్నారు.

గంజాయి వ్యాపారంపై గట్టి నిఘా

- ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం క్రైమ్: గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఎం.దీపిక శనివారం హెచ్చరించారు. గంజాయి వ్యాపారం కట్టడికి జిల్లా పోలీసుశాఖ ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసిందన్నారు. గత పది రోజుల్లో గంజాయి సేవించిన వారిపై 15 కేసులు, వాటిని విక్రయిస్తున్న వారిపై మూడు కేసులు నమోదుచేసి నిందితులను రిమాండుకు తరలించామని చెప్పారు. ప్రత్యేక బృందంలో ఐదుగురు కానిస్టేబుళ్లను ఎస్పీ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నిందితులను పట్టుకోవడంపై బృంద సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ జి.రాంబాబు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గంట్యాడ: మండలంలోని నరవ సమీపంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రూ.37,420 నగదును స్వాధీనం చేసుకున్నామని, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

కలెక్టర్ చొరవతో అందిన వైద్యం

- కొటియా పల్లెల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



గంజాయిభద్రలో నిర్వహించిన వైద్యశిబిరంలో సేవలు పొందేందుకు వచ్చిన గిరిజనులు



కొటియా గ్రామంలో 104 వాహన సిబ్బంది

సాలూరు/కొరాపుట్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని కొటియా పల్లెల్లో వైద్య సేవలందించేందుకు శుక్రవారం వెళ్లిన 104 వాహన సిబ్బందిపై ఒడిశా పోలీసులు దౌర్జన్యం చేయడం, వైద్యసేవలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. దీనిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఆంధ్రా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సేవలను అడ్డుకోవద్దని కోరారు. 104 వాహన సిబ్బందికి గట్టి బందోబస్తు కల్పించారు. దీంతో ఆంధ్రా ప్రభుత్వం తరపున తోణాం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ అజయ్, వైద్యసిబ్బంది ప్రకాష్‌రావు, కన్నయ్య, అశోక్, స్వప్న, కవిత తదితరులు గంజాయిభద్ర, కొటియా గ్రామాల్లో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. సుమారు 70 మంది గిరిజనులకు వైద్యపరీక్షలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య చిట్కాలు వివరించారు. సాలూరు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి, కొటియా సీఐ రోహిణీపతి ఆధ్వర్యంలో పోలీసులు వైద్యసిబ్బందికి ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. పకడ్బందీ చర్యలతో ఒడిశా పోలీసులు మిన్నకున్నారు.



గంజాయి భద్రలో గిరిజనుడి ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్